

# ఆటొమెటిక్ వాచి

మాధవ

బస్‌స్టాపులో నిలబడి టైము చూసుకున్నాను,

ఇంకా పదిహేను నిముషాలుంది సిని మాకి...

ఎదురుగా పెద్ద బట్టల షాపు తళ తళా మెరిసి పోయే కష్టమర్సు. షోకేసులో చీర కట్టిన బొమ్మలు.

ఉల్లి పొరల లాటి దుస్తులలో అమ్మా యిలు కారు దిగి లోపలికి వెళ్ళారు. వాళ్ళ ముఖాలు ఎంతో అమాయకంగా, వున్నాయి. వాళ్ళ కనుబొమలు పెన్సిళ్ళతో దిద్దినా అవ యవాలు వుబ్బ దవ్వుసిన దానికి రెట్టింపు కన బడుతున్నా పొట్ట కిందకి, బొడ్డు కిందకి, ఇంకా కిందకి చీరె కట్టినా, లోనెక్ జాకెట్టు వల్ల వీపంతా కనిపిస్తున్నా వాళ్ళ ముఖాలు అందంగా చాలా అమాయకంగా జాలిగా వున్నాయి.

బట్టల షాపు పైన భోజన హోటల్.

భోజనాలు చేసిన వాళ్ళు బాల్కనీలో నిల బడి చల్లగాలి సేవిస్తున్నారు.

తోచటం లేదు

టైము చూశాను. పది నిమిషాలు.

నాకు చిరాకెక్కువయింది.

బట్టల షాపు పక్కన సందు. బురద, మురుగు.

పందులు, మునిసిపాల్టీవారి 'మూత్ర శాల.'

రెండు పెద్దపెద్ద డస్టు బిన్నులు, పందులు, చిరిగిన విస్తర్లు, కుక్కలు, మనుషులు.

అవును మనుషులు కూడా వున్నారు. ఒక ఆడది. దాని రెండేళ్ళ కొడుకు. గోనె గుడ్డలాంటి చీరముక్క ఒంటికి చుట్టుకుంది. మొహం అమాయకంగా జాలిగా లేదు. చాలా

వికృతంగా అసహ్యంగా క్రూరంగా వుంది. జుట్టు బుట్టలాగా వుంది. ఒక చిరిగిన విస్తరాకు మీద కూచుంది. దేనికోసమో ఎదురు చూస్తున్నట్టు. కుర్రాడు బురదలో 'స్వచ్ఛం' మధ్య ఆడుకుంటున్నాడు సరదాగా.

నాకు జాతీయగీతం గుర్తుకొచ్చింది. వీళ్ళు భారతదేశ పౌరులు కాదేమో ననుకున్నాను. అన్నట్లు వీళ్ళకి ఓటు హక్కు ఉందో లేదో!

టైము చూసుకున్నాను. ఏడునిముషాలు. నాకు పట్టుదల వొచ్చింది. టిక్కెట్టు దొరకకపోతే బ్లాకులోనైనా కానీ సినిమాకి పోవాలి.

మళ్ళీ ఆ ముష్టిదాని వేపు చూశాను. తలలో రెండు చేతులూ పెట్టి బరబరా గోక్కుంటోంది. కుర్రాడు ఏడుస్తున్నాడు. ముందు వూరుకుంది. తర్వాత తిట్టింది. కొట్టింది తోసింది. వాడు మురుగులో పడి ఏడుస్తున్నాడు.

వీళ్ళందరినీ ఓటు వెయ్యమంటే ఎవరికి వేస్తారో అనుకున్నాను. ఎవరు డబ్బిస్తే వారికి వేస్తారేమో? నాకు లోపల్నుంచి చలి లాటిది పుట్టుకొచ్చింది. ఎందుకో గిల్టీగాఫీలయాను ఆమె ఇలా పశువుగా జీవించటానికి నేనే కారణమేమో! తను జంతువులాగా బతుకుతున్న విషయం 'దానికి తెలుసా?' బహుశా తెలీదేమో.

విసుగు పుట్టింది.

మరో అయిదు నిముషాలు. ఆ బురదలో తిరుగుతున్న ఆ కుళ్ళు కుక్కలికి ఆ ఆడది దగ్గర బంధువని నాకు తోచింది. హోటలు బాల్కనీలోంచి ఒక కుర్రాడు పెద్ద బుట్టతో ఎంగిలాకులు కుమ్మరించాడు. చాలా మటుకు బురదలో పడ్డాయి. ఆ మనిషి చివాల్నిలేచి పరిగెత్తింది. ఒకటి రెండు కుక్కలు కూడా చేరినయ్. ఆ ఆడది ఆత్రంగా అన్నం మెతుకులు నోట్లో కుక్కుకొని నమలకుండానే మింగుతోంది. మధ్యమధ్య కొడుక్కి పెడుతోంది పెంట తింటున్న కుక్కలాగా గబగబా తింటోంది టైము చూసుకున్నాను.

అయిపోయింది.

అయినా అట్లాగే నిలబడ్డాను

ఆ ముష్టిది తినీతినీ చివరికి నీరసంగా లేచింది. రెండడుగులు వేసింది. కడుపు రెండు చేతుల్తోనూ గట్టిగా పట్టుకుంది. బాగా వంగి భళుక్కున కక్కింది. కక్కుతూనే వుంది. తిన్నదంతా కింద కుదురులాగా కట్టింది బురదలో బాగా కక్కుకోవటం వల్ల నీరసంగా వుండు. రెండు చేతులూ గోడకానించి ఒంగి మళ్ళీ కక్కింది. మూలుగుతూ మళ్ళీ కక్కటానికి ప్రయత్నించింది. లోపలేమీ లేదల్లే వుంది. ఇంకేం రాలేదు. కింద మెతుకులు మెతుకులుగా వున్న వాంతిని ఒక కుక్క వాసనచూసి దూరంగా వెళ్ళిపోయింది

ఆ మనిషి అట్లాగే గోడకి చేతులు ఆనించి నిలబడి వుంది. నోరు తెరిచింది నోటిమీద ఈగలు. దోకులాగినై గాని నోట్లోంచి జిగట వస్తోంది నెమ్మదిగా నిలబడి అతినీరసంగా కాసేపు నడిచి వచ్చింది.

కక్కిన మెతుకులు దవడలమీద

నోట్లోంచి సాగుతున్న జిగురు.

కొంచెం దూరంగా జరిగాను.

అది నీరసంగానే నా వెంట నాలుగడుగులు నడిచింది. నేను తిట్టుకుంటూ వెళ్లిపోయాను. వెడుతూ టైము చూసుకున్నాను.

నడుస్తూనే వుంది. *